# రాజీనామా

## వసంతరావు రామకృష్ణరావు

యూనివర్సిటీ 'లా' కాలేజి వరండాలో పరధ్యానంగా నడిచి వెడుతోన్న శంకరాన్ని నాలుగు అంగలలో కలిసికొన్నాడు మూర్తి — కలిసికోవడం తడవుగా మూర్తి ఇలా అన్నాడు: "శంకరం సమయానికి కనిపించావు. నీవు నాకు లోగడ ఒకవాగ్దానం చేశావు. జ్ఞాపకం వుందా?" మూర్తి విజయసూచకంగా చిరునవ్వుతో నిలబడ్డాడు. శంకరం మూర్తికేసి ఆశ్చర్యంగా చూస్తూ "నే నేమీ వాగ్దానం చేసినట్లు గుర్తులేదు" అన్నాడు.

మూర్తి ఒక్కసారిగా నిరుత్సాహపడ్డాడు.

శంకరం జ్ఞాపకం తెచ్చుకోవడానికి ప్రయత్నిస్తున్నవాడిలా మొహంపెట్టి నిల్చున్నాడు. మూర్తికి మళ్ళీ ఆశలు చిగిర్చాయి. "శంకరం! నువ్వు డిబేట్‌లో మాటాడుతానని ఒకసారి అన్నావు. గుర్తుకువచ్చిందా?" మూర్తి వేసిన మాటప్రశ్నకు శంకరం నవ్వుతూ "ఓహో! అదేనా! ఏమిటో అనుకున్నాను" అన్నాడు.

మూర్తికి యీ వాక్యంతో పూర్తిగా ధైర్యం చిక్కింది. వెంటనే ఇలా చెప్పాడు: "రేపు సాయంత్రం ఐదుగంటలకు మన 'లా' కాలేజిలో డిబేట్ వుంది. ప్రొఫెసర్ గారినే పరిశీలకులుగా ఆహ్వానించాము. 'చరిత్రపఠనంవలన విజ్ఞానం వృద్ధిపొందదు' అనేది చర్చనీయాంశం. కాబట్టి నీవు తప్పకుండావచ్చి డిబేట్‌లో పాల్గొనాలి. ఇంకా మన మిత్రులను కలిసికొని వారిని కూడా డిబేట్‌లో పాల్గొనేట్లు చేయాలి. తక్కువమంది వస్తే ప్రొఫెసర్ విసుక్కుంటాడు. అందుచేత నేను త్వరగా వెళ్ళాలి. నీవు తప్పకుండా వస్తావుకదూ". మూర్తి ఆందోళనచూసి జాలిపడి, శంకరం సరే అన్నాడు. మూర్తి మరుక్షణం 'లా' కాలేజి ఆవరణలోనుండి తొందరగా వెళ్ళిపోయాడు.

మూర్తి చాలా చురుకయిన యువకుడు. చదువుతోపాటు విజ్ఞానాభివృద్ధికి తోడ్పడే కార్యక్రమాలలో పాల్గొనడం అతని ఆశయం, ఆదర్శం. ఆ కారణంచేతనే లా కాలేజీ డిబేటింగ్ సొసైటీకి సెక్రటరీగా నిలబడి, తన మిత్రులందరినీ కూడదీసుకొని, డిబేట్లు చక్కగా నిర్వహించాలనే ఆశయముతో ఉన్నాడు. తను ఒకసంవత్సరంలో 'లా' పరీక్షకు కూర్చుంటాడు. తప్పక ప్యాసవుతాడు. అప్పుడు తనకూ యూనివర్సిటీకి సంబంధం ఉండదు. తాను సెక్రటరీగా నిర్వహించిన కార్యక్రమాలే అతని స్మృతిపథంలో నిలుస్తాయని అతని గట్టి నమ్మకం. ఇటు మిత్రులూ అటు ప్రొఫెసర్లూ తన కృషిని ప్రశంసిస్తారని మూర్తి ఎంతో ఆశపడ్డాడు.

ఆరోజు క్లాసులు మానేసి మూర్తి మిత్రులను కలిసికొని మర్నాటి డిబేటుకు రమ్మని ఎంతో ఆర్ద్రమైన హృదయంతో ఆహ్వానించాడు. కొంతమంది విషయంపూర్తి 'ప్రిపేర్' కావడానికి వ్యవధి చాలదని వంక పెట్టి రామని నిర్మొహమాటంగా చెప్పారు. మరికొందరు వచ్చేవారంలో డిబేటు ఉన్నట్లయితే తప్పక మాట్లాడగలమని హామీ ఇచ్చారు. కొందరు ప్రొఫెసర్ "అబ్జర్వర్ గా" రావడం బాగులేదని సూచనలు చేశారు. ఇలాగు చాలామంది ఏవేవో సాకులు చెప్పి తప్పించుకొన్నారు. మూర్తికి ఒకవంక నిరుత్సాహం ఎక్కువ అవుతున్నా, మరొకవంక డిబేట్ జయప్రదంగా జరుగుతుందనే నమ్మకం ప్రబలమైంది.

ఎలాగో శ్రమపడి ఒక పదిమంది వక్తలను మర్నాటి డిబేటుకు ఏర్పాటు చేసి, మూర్తి అలసి ఇంటికి చేరుకున్నాడు. బడలిక తీరడానికి వేడినీళ్ళతో స్నానంచేసి, చల్లగాలికి బీచికి వెళ్ళాడు.

ఎదురుగా ఉన్న సముద్రం కెరటాలు లీలా విహారం చేస్తున్నాయి. దూరంగా ఒకస్టీమరు పొగలు క్రక్కుతూ పోతున్నది. మూర్తి మనస్సు కొంచెం తేలికపడింది. అతని ఎదుట ఉన్న సమస్య ఒక్కటే—తాను మర్నాడు డిబేట్‌ని జయప్రదంగా నిర్వహించాలి. తనుపట్టుదలతో పనిచేస్తే తప్పక జయం సాధించగలడు.

అవిఘ్నంగా ఆలోచిస్తోన్న మూర్తికి తాను మర్నాటికి ప్రిపేర్ కావాలన్న విషయం గుర్తుకు వచ్చింది. అప్పుడే రేడియోలో వార్తలు వినిపిస్తున్నాయి. తొందరగా ఇంటికి పోవాలి. మూర్తి ఇంటిముఖంగా నడుస్తున్నాడు. అతని మనస్సంతా డిబేట్ మీద లగ్నమై ఉంది. తను మంచివక్త అని పేరు తెచ్చుకోవాలి; సమర్థుడైన సెక్రటరీ అని మెప్పు పొందాలి.

మూర్తికి అప్రయత్నంగా నవ్వు వచ్చింది. అది రోడ్డు కాబట్టి మూర్తి నవ్వు ఆపుకోవలసి వచ్చింది. మూర్తి మర్నాటి డిబేట్‌లో అందరికీ నవ్వు వచ్చేట్లు ఒక విషయం చెప్పాలని అనుకున్నాడు:- "చరిత్రకారులు ఒక కోటు బొత్తాం దొరికితే దానిగురించి ప్రాచీన మై చరిత్ర అల్లి గ్రంథం వ్రాసారు. ఒక అరిగిపోయిన నాణెం దొరికితే చాలు; ఎంతో విచిత్రమైన చరిత్రాంశాలు కల్పిస్తారు. అవి విద్యార్థులు చదువుతారు. అవి వాస్తవానికి దూరంగా ఉంటాయి. కాబట్టి విజ్ఞానం వృద్ధిపొందదు. అదీకాక విద్యార్థులకు చరిత్రనిండా తేదీలు, యుద్ధాలు, సంధులు, హత్యలు, దోపిడీలు, కుట్రలు— ఇలాంటి వెన్నో కనిపిస్తాయి. ఇవి విజ్ఞాన

(47 వ పేజీ చూడుడు)




సుఖజీవిత సేవ

భారత "సిద్ధ వైద్య మహిమ" మన దేశ సిద్ధుల సాటిలేని కీర్తికి ఒక తార్కాణము.


"మేల్ మాయిల్ మందు"

ప్రపంచములో ప్రఖ్యాతి గాంచిన మేహ, కుష్ఠురోగనివారిణి

భయంకరమైన మేహ వ్యాధివల్ల కష్టపడువారలకు పునర్జన్మమిచ్చు అద్భుత సంజీవి మేహరోగ నివారణ నూనె, లేహ్యము.

డా॥ కే. టి. కృష్ణమూర్తి ఆచారి & సన్సు,

5/22, మేల్‌మాయిల్. (P. O.) (N. A. Dt.) S. India.



నావికుడు

ఫోటో: ఎమ్. శ్రీనివాసన్.

## రాజీనామా

(29 వ పేజీ తరువాయి)

దాయకమైన విషయాలు కొన్ని తను ఘంటాపథంగా చెపాడు. అందరూ హర్షధ్వానాలు చేస్తారు; తానూ కృతకృత్యుడవుతాడు.

మూర్తి ఆ రాత్రికి హాయిగా నిద్రపోయాడు. ఏవో కొన్ని గ్రంథాలు త్రిప్పి, విషయాలు సేకరించుకొని హడావుడిగా 'లా' కాలేజీకి బయలుదేరి వెళ్లాడు. ఐదు గంటలు కావస్తున్నా అట్టేమంది రాలేదు. మూర్తికి దిగులు పట్టుకుంది. టైము ప్రకారం ప్రొఫెసర్ రావడం జరిగింది. మూర్తి ఒక ప్రక్క గదిలో ఆయన్ని కూర్చోపెట్టి మిత్రులను సమావేశపరచడానికి అటూ ఇటూ పరుగులెత్తాడు.


ఐదున్నరకు సమావేశం ప్రారంభమైంది. పదిమందీ వక్తలకి ఆరుగురే వచ్చారు. శంకరం ఉండడం చూసి ధైర్యం తెచ్చుకొన్నాడు మూర్తి. సైన్సు, ఆర్ట్సు కాలేజీ విద్యార్థులు చాలామంది వచ్చారు.

డిబేట్‌ను శంకరం ప్రారంభించాడు. విషయాలు చక్కగా పరామర్శించి మాట్లాడి శంకరం అందరి మన్ననలూ అందుకొన్నాడు. తరువాత మూర్తి నిలబడి తాను ముందురోజు ఊహించిన విషయాలు చెప్పి అందర్నీ నవ్వించాడు. అక్కడితో రక్తి తగ్గిపోయింది. తరువాత వక్తలు ఏదో విసంగా మాటాడాం అనిపించారు. మధ్య మధ్య సభ్యులకూ పరిశీలకుడికీ తలనొప్పి వచ్చే విషయాలు వచ్చాయి. ఎలాగైతే నేం డిబేట్ ముగిసింది.

ప్రొఫెసరుకు కొంచెం విసుకు, చిరాకు కలిగాయి. ఆయన సమావేశం కూర్చి ప్రసంగిస్తూ వక్తలు మాట్లాడిన విషయాలను వారు బాగా నిరూపించలేదని సూచించాడు. అందులో మూర్తి సెక్రటరీగా తన బాధ్యత నిర్వహించలేదని ఆయన పేర్కొనడంతో మూర్తికి తల తిరిగినట్లయింది. తను ఒక్కడూ ఏం చేస్తాడు? అందరినీ బ్రతిమాలుకొన్నాడు. కాని ఒక్కరూ ముందుకు రాలేదు. అంతా తనలా ఉత్సాహంతో పాల్గొంటారని అనుకున్నాడు. బాధ్యతగల విద్యావంతులే ఇలా ప్రవర్తిస్తారని అతడు అనుకోలేదు.

మూర్తి నిలబడి క్షమాపణలు చెప్పుకొన్నాడు. ప్రొఫెసరు ముఖం విప్పారింది. మిత్రులందరూ పాల్గొన్నందుకు (అందరూ రాలేదు!) వారిని అభినందించాడు. ముందు ముందు ఎక్కువమంది పాల్గొంటారనే ఆశాభావం వెలిపుచ్చాడు. అన్నీ సంప్రదాయ ప్రకారంగా జరిగాయి. వందన సమర్పణతో సమావేశం ముగిసింది.

మర్నాడు మూర్తి తన సెక్రటరీపదవికి అనారోగ్య కారణాలమీద రాజీనామా ఇచ్చాడు. ★




నారసింహ లేహ్యము

బంగారుతో చేరినది. మేహము, నిక్లాక, విష్ణుత్తువ వగైరా హరించి బలము రక్తవృద్ధి కల్గించును. 20 తు డబ్బీ రు. 3-4-0. పోస్టేజిరు. 1-1-0

వి. వ. ఎ. అండ్ కంపెనీ ఆయుర్వేద సమాజం, పెరిదేపి (PO) నెల్లూరుజిల్లా.